క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మత్తు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారా నగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్‌టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్స్ పరిసర ప్రాంతాలు
- ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు వాహెద్‌నగర్, వాహెద్‌నగర్ జెండా పీటీ, ఓల్డ్ మస్తాన్ గట్టీ, వాహీద్‌నగర్, ఏ టూ జెడ్, అల్ఫాలా మజీద్, న్యూవాహీద్‌నగర్ పరిసర ప్రాంతాలు
- ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు జాఫ్రీ హాస్పిటల్ లేన్ పరిసర ప్రాంతాలు
- ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు శంకర్‌నగర్, విద్యానగర్, ఓల్డ్ శంకర్‌నగర్, కిసాన్ దొడ్డి, సరోజినగర్, నూర్‌ఖాన్ బజార్, యునైటెడ్ బేకరి, నూర్ కేఫ్, సెంట్రల్ బ్యాంక్, దారు షఫా చమన్, హుస్సేనీ మొహల్లా, ఇండియన్ బ్యాంక్, మదీన కాంప్లెక్స్, లాల్‌మిట్టీ దర్గా, ఎంసీహెచ్ ఆఫీస్ ప్రాంతం

19న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈనెల 19న చంపాపేట సాయిరాంనగర్ కాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9440813114 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



ఏరియా ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న చంద్రకాంత్ గౌడ్ తదితరులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.చంద్రకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాయకులు నాగరాజ్‌గౌడ్, అశోక్ సింధు, రాంబాబు, కాశీనాథ్, వెంకటేష్, నాగు, శ్రీను, హరి పాల్గొన్నారు.

మూడు వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవం వాయిదా

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని మూడు డివిజన్ల వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవం వాయిదా పడింది. చైతన్యపురి, బీఎన్‌రెడ్డి నగర్ , గడ్డిఅన్నారం డివిజన్ల కోసం ఎంపిక చేసిన వార్డు కార్యాలయ భవనాలలో ఏర్పాట్లు పూర్తి కాక పోవటంతో వాయిదా వేసినట్లు తెలుస్తుంది. ప్రారంభోత్సవం ఈనెల 22కు వాయిదా పడినట్లు కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

వార్డు కార్యాలయం ప్రారంభోత్సవంలో ఉద్రిక్తత

చంచల్‌గూడ: యాకుత్‌పురా నియోజకవర్గంలోని కుర్మగూడ డివిజన్ కార్పొరేటర్‌గా మహిళ కొనసాగుతున్నారు. శుక్రవారం ఉప్పరిగూడలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఆమె సోదరుడు షఫత్ అలీ వచ్చాడు. అధికారులు సన్మానం కూడా చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, నాయకుడు నిరంజన్ యాదవ్‌లు ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నారు. బీజేపీ, ఎంఐఎం నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. ఎట్టకేలకు ఎమ్మెల్యే పాషా ఖాద్రి వచ్చి కార్పొరేటర్ సోదరుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్‌లను వెంటబెట్టుకుని ప్రారంభించారు.

భారీ అగ్నిప్రమాదం



సాక్షి,సిటీబ్యూరో : వనస్థలిపురంలోని విడేమ్స్ ఫర్నిచర్ అండ్ సిల్క్స్ షో రూమ్‌లో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్టోర్ మూసివేసి వెళ్లిన తరువాత షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించిందని తెలిసింది.అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పారు.



పరేషాన్ లేదిక..

ఇన్ని రోజులు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లు.. ఇక నుంచి ఈ సమస్య ఉండదు.. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారమవుతాయి.. అందుకే ఈ వార్డు కార్యాలయాల ఏర్పాటు అని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. శుక్రవారం పలుచోట్ల వార్డు కార్యాలయాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలు
- పలుచోట్ల ప్రారంభించిన కార్పొరేటర్లు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు, నాయకులు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

సైదాబాద్: విపత్కర సమయాల్లో సహా అన్నివేళలా సమాజానికి పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవలు ఎనలేనివని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శుక్రవారం ఆయన సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి సైదాబాద్ హౌజింగ్ బోర్డు కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్‌బీహెచ్–బి కాలనీ కమ్యూనిటీహాల్‌లో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, కళ్యాణ్, చందూ, రాజు, నాగరాజు, ఫజల్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికే...



ఐఎస్‌సదన్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సుబ్రమణ్యనగర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన నూతన వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. వివిధ శాఖల సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పలు కార్యాలయాల చుట్టూ తిరిగే సమస్య తొలిగి ఏ ప్రభుత్వ విభాగంకు సంబంధించిన సమస్యను అయినా ఈ కార్యాలయాలకు వెళ్లి పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మహ్మద్ వసీవుద్దీన్, వాటర్‌వర్క్స్ ఏఈ మినాజ్, టౌన్‌ప్లానింగ్ నుంచి దేవేందర్, సీఓ యాదయ్య, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం: కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, స్థానిక కాలనీల ప్రజలు వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయంను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. వార్డు కార్యాలయాల్లో సిబ్బంది కాలనీ లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి నాగేందర్, డీఈ రఫీ, ఏఈ ప్రజ్ఞ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వీరస్వామి, కాలనీ అధ్యక్షులు సిరిగిరి రాంరెడ్డి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

అందరికీ అందుబాటులో..



నాగోలులో వార్డ్ కార్యాలయంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కార్పొరేటర్ అరుణ

నాగోలు: ప్రజా సమస్యలను సులభంగా, అతివేగంగా పరిష్కరించడానికి, పౌరసేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డివిజన్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. నాగోల్ డివిజన్ లో లలిత నగర్ రోడ్ నెంబర్ -1 లో నూతన వార్డ్ కార్యాలయంను నాగోలు కార్పొరేట్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలసి ఎమ్మెల్సీ యెగ్గె ప్రారంభించారు. వార్డు ఇంచార్జ్ సుధాకర్, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ సిటి ప్లానర్ సుస్మిత పాల్గొన్నారు.



కొత్తపేటలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట డివిజన్‌లో...

కొత్తపేట డివిజన్ పరిధిలో మహిళ భవన్ వద్ద ఏర్పాటు చేసిన నూతన వార్డు కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు.

ప్రజలకు అందుబాటులోకి అధికారులు

హయత్‌నగర్: డివిజన్‌లోని మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డివిజన్‌లోని 11 శాఖల అధికారులు ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఈ కార్యాలయంలోని అధికారులను కలవ వచ్చని తెలిపారు. డిప్యూటీ కమీషనర్ మారుతీ దివాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో..



వార్డు కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: క్షేత్ర స్థాయిలో అత్యంత సరళమైన రీతిలో సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం వార్డు కార్యాలయాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చిందని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఫ్రెండ్స్‌కాలనీలో శుక్రవారం వార్డు కార్యాలయం ప్రారంభించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా 'సఫాయి అమ్మ- సలాం అమ్మ, సఫాయి అన్న- సలాం అన్న' కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు బాగా పనిచేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ఎప్పుడు ముందుంటానని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలన ఇక సులభతరం



కార్పొరేటర్ సుజాతనాయక్‌ను అభినందిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

హస్తినాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలు ఉపయోగపడతాయని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని నందనవనంకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ సుజాతనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ వార్డు కార్యాలయం ద్వారా పాలన సులభతరం అవుతుందని, ప్రజలకు 11 రకాల సేవలు అందుబాటులో ఉంటాయని డివిజన్ పరిదిలోని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిప్యూటీ కమీషనర్ సురేందర్‌రెడ్డి, ఏఈ కోటేశ్వర రావు, విఘ్నేశ్వర్, ఇంజనీర్ హేమానాయక్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్రీదేవి, వాటర్‌వర్క్స్ అధికారి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేశ్ పాల్గొన్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే వార్డు కార్యాలయాలు

హోంమంత్రి మహమూద్‌అలీ

చాదర్‌ఘాట్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినవే వార్డు కార్యాలయాలు అని రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. శుక్రవారం అజంపురాలో వార్డు కార్యాలయాన్ని ఆయన ఎమ్మెల్యే బలాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రతి పనికీ జీహెచ్‌ఎంసీలోని జెడ్‌సీ, డీసీ అధికారుల వద్దకు వెళ్లేవారని ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. నేరుగా వార్డు కార్యాలయానికి వెళ్లి సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ, వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్‌సీ అశోక్‌సామ్రాట్, డీసీ జయంత్, మలక్‌పేట ఇన్‌చార్జ్ లాయక్‌అలీ పాల్గొన్నారు.



అజంపురాలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ

ప్రజలకు చేరువలో ఉండాలనే వార్డు కార్యాలయాలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు చేరువలో ఉండాలనే మంత్రి కేటీఆర్ ఆలోచనతో వార్డు కార్యాలయాలు ఏర్పాటయ్యాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మన్సూరాబాద్ జడ్జెస్‌కాలనీలో ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణ, సత్వర సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. డ్రైనేజీ సమస్యలు, టౌన్ ప్లానింగ్, రోడ్లకు సంబంధించి, వీధీ దీపాలు, దోమల నివారణ, శానిటేషన్ తదితర సమస్యలన్నింటిని వార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సమస్య ఎక్కడ ఉన్న ప్రజలకు అందుబాటులో ఉన్న వార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, సమస్యను సంబంధిత వార్డుకు అధికారులు బదిలీ చేస్తారని వివరించారు. వార్డు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు ఒక రిసెప్షనిస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతి దివాకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుష్మిత, ఇంజనీరింగ్ ఈఈ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి

చంపాపేటలో... చంపాపేటలోలో గాంధీ బొమ్మ సమీపంలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ ముఖ్యఅతిథులుగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఎల్‌బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్ పాల్గొన్నారు.



చంపాపేటలో ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్ పంకజ

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు

లింగోజిగూడ: సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, ఉదయం 10గంటల వరకు అందరూ వార్డు కార్యాలయంలో ఉండాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ తెలిపారు. పట్టణ ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన లింగోజిగూడ డివిజన్ వార్డు కార్యాలయాన్ని శుక్రవారం మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు పాలన అందుబాటులో ఉండే విధంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఇచ్చిన గడువు లోపల సమస్యలను పరిష్కరించాలని నిర్లక్ష్యం వహిస్తే ఉన్నత అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. ఇచ్చిన సమయంలో పనులు కాకపోతే నేరుగా మేయర్ కార్యాలయానికి ఫోన్ చేయాలని ఆమె సూచించారు. వార్డు కార్యాలయానికి ఏఎంసీ ఇంచార్జ్‌గా ఉంటారని మొత్తం 10 విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏ సమస్య ఎన్ని గంటల్లో పరిష్కారమవుతుందో చార్ట్‌ను వార్డు కార్యాలయాల వద్ద ఏర్పాటు చేశామని,చార్ట్ ప్రకారం పనులు జరుగుతాయని తెలిపారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, డీసీ సురేందర్‌రెడ్డి, డీఈలు వెంకటేశ్వర్లు, కనకయ్య, వార్డు కార్యాలయం ఇంచార్జ్ విక్రమ్, ఏఈ విజయ్, వాటర్ వర్క్స్ డీజీఎం సరిత తదితరులు పాల్గొన్నారు.



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మీ, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలి

సైదాబాద్: బీజేపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నూతనంగా నియమితుడైన ఆయనను శుక్రవారం సైదాబాద్ డివిజన్‌కు చెందిన పలువురు పార్టీ కార్యకర్తలు కళ్యాణ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మడిగెల లక్ష్మారెడ్డి, వేణుగోపాల్, జీవన్, బాబు, చిన్న పాల్గొన్నారు.



లింగాల హరిగౌడ్‌ను సన్మానించిన బీజేపి కార్యకర్తలు

పారదర్శక పాలన కోసమే వార్డు కార్యాలయాలు

విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రరెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజలకు పారదర్శకమైన సత్వర సేవలందించాలనే ఉద్దేశ్యంతోనే వార్డు కార్యాలయాలన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ కృష్ణానగర్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చెవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గరాపు దయానంద్ గుప్త, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. సమస్యలను పరిష్కరించే దిశగా చేపట్టిన వార్డుస్థాయి పాలనతో ప్రజలకు మరింత చేరువగా సేవలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమీషనర్ పంకజ, తహసీల్దార్ జయశ్రీ, డీసీ కృష్ణయ్య పాల్గొన్నారు.



వార్డు కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి

అడ్డుకున్న స్థానికులు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ ప్రొఫెసర్స్‌కాలనీ పార్కులోని భవనంలో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ ప్రారంభించడానికి వెళ్లగా కాలనీవాసులు అడ్డగించారు. కాలనీకి సంబంధించిన ప్రైవేట్ భవనంలో ఎట్లా పెడతారంటూ, కాలనీలో 20 ఫీట్ల రోడ్డు వాహనాల రద్దీ పెరిగితే రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని అడ్డుకున్నారు. గవర్నమెంట్ క్వార్టర్స్ ఖాళీగా ఉన్నాయి. అక్కడే ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉన్నాయి. వార్డు కార్యాలయం కూడా అక్కడే పెట్టాలని.. లోపలికి వెళ్లకుండా పార్కు గేట్‌కు తాళం వేశారు. ప్రైవేట్ భవనంలో కాలనీ అసోసియేషన్ అనుమతి లేకుండా ఎట్లా పెడతారంటూ అధికారులను ప్రశ్నించారు. కార్పొరేటర్ వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. అనంతరం ఎమ్మెల్యే బలాల హామీతో కార్యాలయం ప్రారంభమైంది.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

'బీఆర్‌ఎస్ నేతల ప్రవేశంతో వార్డు కార్యాలయం అపవిత్రం '

చంపాపేట: చంపాపేట డివిజన్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభోత్సవం పేరిట ప్రవేశంతో అపవిత్రంగా మారిందని డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోనల్ కమిషనర్ పంకజతో కలసి వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మధుసూధన్‌రెడ్డి కార్యాలయానికి హాజరై గోపంచకంతో శుద్ధిచేసి మరోసారి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...డివిజన్ వాసులకు మెరుగైన సేవలు అందించేందుకే తాను నిరంతరం కృషిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో వంగ మధుసూధన్‌రెడ్డి

రేపు రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

మలక్‌పేట: ఈనెల 18న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు విద్యార్థులు హాజరై విలువైన బహుమతులు గెలుచుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ కోరారు. మూసారంబాగ్, సలీంనగర్, మలక్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ హస్టళ్లలో శుక్రవారం క్విజ్ పోటీలపై ప్రచారం చేశారు. విద్యార్థులతో కలిసి 'ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్'ను విడుదల చేశారు. క్విజ్ పోటీలు పూర్తిగా ఉచితమని, ఆసక్తి కలిగిన వారు ఈనెల 17 లోగా తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్‌ఎంఎస్ పొందడానికి ఆసక్తి కలిగిన వారు 7661 899 899 సెల్ నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వాలని కోరారు.

కొన్ని కులాలకే సహాయం సమంజసం కాదు

సైదాబాద్: బీసీ బంధు పేరిట కులవృత్తిదారులకు రూ.లక్ష సహాయం పథకాన్ని బీసీల్లోని కొన్ని కులాలకే పరిమితం చేయడం ప్రభుత్వానికి సమంజసం కాదని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు రెండు వందలు ఉన్న బీసీ కులాల వారిలో కేవలం 15 కులాలకే సహాయం అందించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు చివరితేదిని తీసేయాలని అన్నారు.

'మన పట్టణాలు దేశానికే ఆదర్శం'

చంపాపేట: తెలంగాణలోని పట్టణాలు అభివృద్ధిబాటలో దూసుకెళుతూ దేశానికే ఆదర్శవంతంగా ఉన్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ అలేఖ్య టవర్ సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న స్కైవోవర్ వద్ద ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎల్‌బీనగర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జాం సమస్య తలెత్తేదని టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఫ్లై ఓవర్‌లు, అండర్ పాస్‌లు, నాగోల్ జంక్షన్, కామినేని జంక్షన్‌లలో ఫ్లైవర్‌లు, చింతలకుంటలో అండర్ పాస్‌లు, అలేఖ్య టవర్‌వద్ద రెండు ఫ్లై ఓవర్‌లు ఏర్పాటు చేయటంవల్ల ఫ్రీ సిగ్నల్ చౌరస్తాలుగా మారాయని అన్నారు. అసంపూర్తి దశలోని కొన్ని ఫ్లైవర్‌లు సెప్టెంబర్ మాసం లోపు పూర్తి అవుతాయని అన్నారు. ఎల్‌బీనగర్ పరిధిలోని పలు డివిజన్లలో వరద ముంపు సమ్యను చెక్ పెట్టేందుకు ఎస్‌ఆర్‌డీపీ రూ 658 కోట్ల నిధులతో వరదనీటి కాలువలు, నాలాల విస్తరణ పనులుప్రారంభించామన్నారు. రాబోయే రోజుల్లో హయత్‌నగర్ వరకు మెట్రో లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం , దయానంద్, సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.